క్లుప్తంగా

వారిది నమ్మకద్రోహమే..



తిరుమలలో సర్పంచ్ మిత్రునాయక్

యాలాల: అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి వెంటే ఉంటూ కొందరూ నమ్మకద్రోహం చేశారని సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, బషీర్‌మియాతండా సర్పంచ్ మిత్రునాయక్ ఆరోపించారు. ఎమ్మెల్యేగా రోహిత్ గెలవాలంటూ నవంబర్ 11 నుంచి ఒంటిపై చొక్కా, కాళ్లకు చెప్పులు ధరించకుండా దైవదర్శనాలు చేస్తూ వచ్చానని, ఆయన ఓటమి తనను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన చెందారు. అయినప్పటికీ.. తిరుపతి నుంచి తిరుమల వరకు కాలినడకన వేంకటేశ్వరుడిని దర్శించుకున్నానని, నమ్మక ద్రోహం చేసినవారికి భవిష్యత్తులో తగిన శాస్తి తప్పదని పేర్కొన్నారు.

తుల్జాభవానికి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న గిరిజనులు

కుల్కచర్ల: గిరిజనుల ఆరాధ్య దైవం అయిన తుల్జాభవానికి తండా వాసులు ఘనంగా పూజలు చేశారు. మూడు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమాలను మంగళవారం వాల్యానాయక్ తండాలో ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి అమ్మవారి సన్నిధిలో పూజలను వైభవంగా చేస్తామని స్థానికులు చెప్పారు.

ధ్యానం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నరేందర్ రెడ్డి తదితరులు

దోమ: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని శివారెడ్డిపల్లి సర్పంచ్ నరేందర్ రెడ్డి కోరారు. మంగళవారం దోమ మండలం శివారెడ్డిపల్లి గ్రామంలో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఎవరు కూడా దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నయ్య, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, డీసీ ఎమ్మెస్ ఇన్‌చార్జి సంతోష్, నాయకులు అర్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కొడంగల్ రూరల్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన సవారి దస్తగిరి అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు కృష్ణంరాజు మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సోమశేఖర్, రామకృష్ణ, చిరు, రాములు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: ఘణాపూర్ గ్రామానికి చెందిన లాజర్ (42) సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్. కొండల్‌రెడ్డి.. ట్రస్ట్ సభ్యుడు, పంచలింగాల సర్పంచ్ సురేందర్‌రెడ్డి ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రజల ఆశీర్వాదంతోనే టీఆర్ఆర్ గెలుపు



శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: పరిగి ఎమ్మెల్యేగా టి.రామ్మోహన్ రెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల అధ్యక్షులు ఆంజనేయులు, అశోక్ కుమార్‌లు శ్రీశైలం మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల ఆశీర్వాదం, ఆదరాభిమానలతో టీఆర్ఆర్ అసెంబ్లీకి వెళ్లనున్నారని చెప్పారు. అదే విధంగా ఆయనకు మంత్రి పదవి ఇచ్చే అంశంపై ఏఐసీసీ పెద్దలు దృష్టి సారించాలని కోరారు.

కొడంగల్ కొదమసింహం

- సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డి ఖరారు
- కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

'కొడంగల్ కింగ్ మా రేవంతన్న. ఆయన హయాంలో నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందింది. ఇప్పుడు ముఖ్యమంత్రిగా కొలువుదీరడం చాలా సంతోషంగా ఉంది. రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ అభివృద్ధి చెంది, ప్రజలు సుభిక్షంగా ఉంటారు' అని ఉమ్మడి రంగారెడ్డి, పాలమూరు జిల్లా ప్రజలు స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరతీస్తూ.. సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. దీంతో జిల్లాలో సంబురాలు అంబరాన్నంటాయి. పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచి పెట్టి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. జిల్లా నుంచి రేవంత్ ముఖ్యమంత్రి కావడం మంచితరుణం అని చెప్పారు. మరిన్ని అభిప్రాయాలు వారి మాటల్లోనే..

– సాక్షి, నెట్‌వర్క్



కొడంగల్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

చాలా సంతోషం



రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. చాలా సంతోషంగా ఉంది. రానున్న కాలంలో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయి. కొడంగల్ రూపు రేఖలు మారుతాయి.

– సంజీవరెడ్డి, పెద్ద నందిగామ

అభివృద్ధి జరుగుతుంది



కొడంగల్ నుంచి గెలిచిన రేవంత్ రెడ్డి.. ముఖ్యమంత్రి కావడం సంతోషంగా ఉంది. ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఇక్కడికి వస్తారు. ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతారు. నియోజకవర్గంలో నెలకొన్న సాగునీటి ఎద్దడి తీర్చడంతో పాటు రైల్వేలైన్ మంజూరు చేస్తారు.

– గురునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడంగల్

ఆకాంక్ష నెరవేరుతుంది



ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనతోనే అభివృద్ధి జరిగింది. విద్య, వైద్యం, రవాణా రంగాన్ని మరింత మెరుగు పరుస్తారు. ఆయన హయాంలో ఇక్కడ పారదర్శకంగా పాలన సాగింది.

– ముద్దప్ప దేశ్‌ముఖ్, ఎంపీపీ కొడంగల్

రాష్ట్రం సుభిక్షం



రేవంత్‌రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రి కావడం సంతోషంగా ఉంది. ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాం. ఆలయాల అభివృద్ధిపై ఆయన ప్రత్యేక చొరవ చూపాలి. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేయాలి.

– జయతీర్థ చారి, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు, రేగడి మైలారం

సొసైటీలు బలోపేతం



వైఎస్ఆర్ హయాంలో ప్రాథమిక సహకార సంఘాలు బలంగా ఉండేవి. ఆయన తర్వాత సొసైటీలను ఎవరూ పట్టించుకోలేదు. నిధుల మంజూరులో నిర్లక్ష్యం చేశారు. రేవంత్ సీఎం అయ్యాక, సొసైటీలకు పూర్వవైభవం వస్తుంది.

– శివకుమార్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్, కొడంగల్



కొడంగల్‌లో బాణసంచా కాలుస్తున్న శ్రేణులు

ప్రజల అదృష్టం



రేవంత్ ముఖ్యమంత్రి కావడం కొడంగల్ ప్రజల అదృష్టం. ఆయన సీఎం అయిన తర్వాత నియోజకవర్గం రూపురేఖలు మారిపోతాయి. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందనడంలో సందేహం లేదు. నియోజకవర్గానికి ప్రత్యేక కేటాయింపులు ఉంటాయి. ప్రజలు ఆశించిన స్థాయిలో పరిపాలన ఉంటుంది.

– నందారం ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ, మండల అధ్యక్షుడు

ఆరుతడి పంటలపై ఆసక్తి

పెరిగిన ఉల్లి, స్వీట్‌కార్న్, వేరుశనగ సాగు



ఉల్లి నాటు వేస్తున్న కూలీలు

పెద్దేముల్: వరి పంటలతో పాటు ఆరు తడి పంటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో అన్నదాతలు ఆ దిశగా పయనిస్తున్నారు. మండల పరిధి బుద్దారం, తింసాన్‌పల్లి, పెద్దేముల్, గోట్లపల్లి, కందనెల్లి, గిర్మాపూర్, గాజీపూర్ గ్రామాల్లోని రైతులు ఉల్లి, స్వీట్‌కార్న్, వేరుశనగ, జొన్న, కూరగాయలతో పాటు పూల సాగుపై మక్కువ చూపుతున్నారు. తినడానికి బియ్యం కొనక తప్పడం లేదని కొందరు రైతులు వరి పండిస్తున్నారు. బోరు బావులు ఉన్న వారు ఎక్కవ శాతం వేరుశనగ, ఉల్లి పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఇదిలా ఉండగా.. రాయితీపై సాగు పరికరాలు, విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు సబ్సిడీని పూర్తిగా ఎత్తివేశాయని వాపోయారు. రైతు సంక్షేమమే సౌక్యమని భావించే ప్రభుత్వాలు రాయితీపై ఎరువులు, డ్రిప్, స్పింకర్లు తదితర వ్యవసాయ పరికరాలను అందజేయాలని కోరుతున్నారు.

రైతులకు మిచాంగ్ గండం

- ఆందోళనలో అన్నదాతలు
- కోతకు వచ్చిన పంటలపై తుపాను ప్రభావం
- రైతు కూలీలు దొరకక సతమతం
- చలి తీవ్రతతో గడప దాటని ప్రజలు



ధాన్యం రాశులపై కవర్లు కప్పిన రైతులు



కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట

దౌల్తాబాద్: ప్రతికూల వాతావరణ పరిస్థితులు అన్నదాతను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. దీంతో కొందరు రైతులు దిగుబడిని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. రాశులపై టార్పాలిన్లు కప్పి, ధాన్యాన్ని కాపాడుకునే యత్నం చేయగా.. వరి కోతలు మొదలు పెట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. వీలైనంత త్వరగా కోతలు పూర్తి చేయడానికి సన్నహాలు చేస్తున్నారు. కానీ రైతు కూలీలు దొరకక సతమతమవుతున్నారు.

వర్షం వస్తే నష్టమే..

వరి పంట కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడితే పంట నేలవాలి పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కురిసిన వర్షాలతో ఇప్పటికే సరైన దిగుబడి రాలేదని, ఇప్పుడు పంట చేతికి వచ్చే దశలో వర్షాలు పడితే.. చేతికిరాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి సైతం కోల్పోయి, అప్పులు మిగులుతాయని చెప్పారు. దిగుబడి చేతికి వచ్చినా.. కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని, దీంతో దిగుబడిని ఎలా కాపాడుకోవాలో అర్థం కాని దుస్థితని వాపోతున్నారు.

గడప దాటని ప్రజలు

పెద్దేముల్: మిచాంగ్ తుపాను వలన వీస్తున్న ఈదురు గాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు. దీంతో ఎక్కువ శాతం వారు ఇంటికే పరిమితం అవుతున్నారు. దినసరి కూలీలు సైతం గడప దాటని పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా వ్యవసాయంపై తుపాను ప్రభావం పడింది. పంటలను కాపాడుకోలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. చేతికొచ్చిన పత్తి ఏరదామన్నా, వరిని కోద్దామన్నా కూలీల కొరతతో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా మారింది వారి దుస్థితి. వాతావరణంలో అనుకూల పరిస్థితులు ఏర్పడి, రైతు కూలీలు వస్తే కాని దిగుబడి చేతికివచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం చేతికి వచ్చిన రైతులు.. కొనుగోలు కేంద్రాలు లేక, దిగుబడిని టార్పాలిన్లు కప్పి రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం విక్రయించాలని వ్యవసాయ అధికారులను రైతులు కోరుతున్నారు.

కస్తూర్బాలో సమస్యల తిష్ట

సౌకర్యాల లేమితో విద్యార్థినుల అవస్థలు



సెప్టిక్ ట్యాంకును పరిశీలిస్తున్న స్థానికులు

పూడూరు: సౌకర్యాల లేమీతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు చెప్పారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని మంగళవారం పలువురు పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. గృహంలో కనీస వసతులు కొరవడ్డాయని తెలిపారు. ఇతర అవసరాలు ఎలా ఉన్నా.. అపరిశుభ్రమైన మరుగు దొడ్లు, సెప్టిక్ ట్యాంక్ నిండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని వాపోయారు. తద్వారా విద్యార్థునులు హాస్టల్‌లో ఉండలేక పోతున్నారని పేర్కొన్నారు. అత్యవసరాలకు ఆరు బయటకు వెళ్తున్నారని వెల్లడించారు. సమస్యలను సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



కొత్త నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మయ్య

- మొక్కలు ఎండితే చర్యలు తప్పవు
- ఎంపీడీఓ లక్ష్మయ్య

పెద్దేముల్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీఓ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం మండల పరిధి హన్మాపూర్, ఇందూరు, గొట్లపల్లి గ్రామాల్లో హరితహారం, పల్లె ప్రగతి వనాలతో పాటు, నర్సరీని పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. మండలంలో 37 నర్సరీల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రతి నర్సరీలో 5 వేలు, ఐదు రకాల మొక్కలను పెంచుతామని తెలిపారు. ప్రతి పల్లెను పచ్చదనంతో నింపాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడంతో పాటు, నాటిన మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు వెల్లడించారు. నర్సరీలో ఒక్క మొక్క చనిపోయినా, జీపీ, ఉపాధి సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. నర్సరీల నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

'గులాబీ'కే లీడ్

కొందుర్గు: షాద్‌నగర్ నియోజకవర్గం అన్ని మండలాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యం రాగా.. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో బీఆర్ఎస్ లీడ్ వచ్చిందని మండల నాయకులు తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రం తోపాటు ఇంద్రానగర్, ఎల్కగూడ, పెద్ద ఎల్కిచర్ల, వీరన్నపేట, చేగిరెడ్డి ఘనాపూర్, గుంజల్‌పహాడ్, ఎదిర, ముష్టిపల్లి, పీర్జాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్‌కే ఓట్లు ఆధికంగా పడ్డాయని నాయకులు పేర్కొన్నారు. అన్ని గ్రామాలతో కలిపి బీఆర్ఎస్‌కు 1,494 ఓట్ల ఆధిక్యత లభించింది. కొందుర్గు మండల కేంద్రంతోపాటు శ్రీరంగాపూర్, చిన్నఎల్కిచర్ల, పర్వతాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్‌కు అత్యధికంగా ఓట్లు పోల్ అయ్యాయి.

అభివృద్ధికి సహకరిద్దాం

కొందుర్గు: కార్యకర్తల కృషితోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిందని, ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరి సహకారం తప్పనిసరిగా ఉండాలని పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో వీర్లపల్లి శంకర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి, ఎమ్మెల్యేగా గెలిపించడం సంతోషకరమన్నారు.

కంకర తేలింది

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి శివరామాలయాకు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి మైసిగండి సమీపాన కిలో మీటరు దూరంలో శివరామాలయాలు ఉన్నాయి. భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు 20 ఏళ్ల క్రితం ఈ మార్గంలో బీటీ రోడ్డు వేశారు. అయితే ప్రస్తుతం అది పూర్తిగా కంకర తేలి మట్టిరోడ్డును తలపిస్తూ గోతులమయంగా మారింది. కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని. సంబంధిత అధికారులు స్పందించి, బీటీ రోడ్డును పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు.

చేవెళ్లలో విలక్షణ తీర్పు!

సంబురాలకు దూరంగా గెలిచిన, ఓడిన నాయకులు



చేవెళ్ల: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల ప్రజల విలక్షణ తీర్పుతో అటూ గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి, ఇటూ ఓటమి చవి చూసిన నాయకులు సందిగ్ధంలో పడ్డారు. ఈ ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను గెలిపించుకున్నారు. రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. దీంతో చేవెళ్లలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సంబురాలకు దూరంగా ఉన్నారు. విచిత్రమేమంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమి పాలయితే, చేవెళ్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని జనం గెలిపించుకున్నారు. దీంతో ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే సంబురాలు చేసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. అటూ కాంగ్రెస్‌లోనూ ఇక్కడ అదే పరిస్థితి ఉంది. ఇన్ని రోజులు కష్టపడి పనిచేసిన పార్టీ ఎమ్మెల్యేను గెలిపించుకోలేకపోయిన బాధలో కార్యకర్తలు ఉంటే రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్‌కే ప్రజలు మద్దతు ఇచ్చి పట్టం కట్టారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టనుంది.

గెలిచిన ప్రతీసారి ప్రతిపక్ష ఎమ్మెల్యేనే అంటూ చర్చలు..

ఈ నియోజకవర్గంలో ఓటర్లు ఇచ్చే తీర్పు విలక్షణంగా ఉండడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలే ఉంటారని అందరూ చర్చించుకుంటున్నారు. గత కొన్ని ఎన్నికలను పరిశీలిస్తే వారి వాదనలు నిజమనిపించక తప్పదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఇచ్చే తీర్పుకు చేవెళ్ల నియోజకవర్గంలో ఇచ్చే తీర్పు భిన్నంగానే ఉంటూ వస్తోంది. అధికారంలోకి వచ్చే పార్టీ ఎమ్మెల్యేను కాకుండా ప్రతిపక్షపార్టీ ఎమ్మెల్యేనే పలు మార్లు గెలిపించారు. ఇప్పుడు అదే తీర్పు మళ్లీ కొనసాగినట్టింది. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇంద్రారెడ్డి గెలుపొందినప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కొన్ని నెలలకే ఆయన అకాల మరణంతో సతీమణి పి సబితారెడ్డి కాంగ్రెస్ నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత పునర్విభజనలో భాగంగా చేవెళ్ల ఎస్సీ రిజర్వు కావడంతో 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి కేఎస్ రత్నం ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. తెలంగాణ రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా టీఆర్ఎస్ నుంచి కేఎస్ రత్నం పోటీ చేస్తే కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాలె యాదయ్యను గెలిపించారు. అప్పుడు రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిపోయారు. ఆ అతరువాత 2018లో జరిగిన ఎన్నికల్లో మాత్రం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించడంతో ఈ తీర్పు మారిందనుకున్నారు. కాని 2023 ఎన్నికల్లో మళ్లీ పాత తీర్పు రిపిట్ అయ్యిందని పలువురు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించడంతో ఇక్కడి ప్రజల తీర్పు విలక్షణంగానే ఉంటుందని చర్చ జరుగుతుంది.

బస్సు సర్వీసులు పెంచండి

ఏబీవీపీ డిమాండ్



చేవెళ్లలో ఆర్టీసీ కంట్రోలర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ ప్రతినిధి శివ

చేవెళ్ల: విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న రవాణ సమస్యలను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులు పెంచాలని ఏబీవీపీ ప్రతినిధి శివ డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రం ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో మంగళవారం కంట్రోలర్‌ను కలిసి బస్సుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నుంచి శంకర్‌పల్లికి వెళ్లే రూట్‌లో బస్సులు సరిగ్గా లేకపోవడం వలన చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు, గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విద్యాలయాల సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని, వచ్చే బస్సులు కూడా సమయపాలన పాటించేలా చూడాలని కోరారు. వికారాబాద్ రూట్‌లో ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు సమయానికి కళాశాల, పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారని తెలిపారు. ఉదయం తరగతులకు, అనంతరం ఇంటికి సకాలంలో చేరుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సర్వీసులను పెంచడంతో పాటు, సమయ పాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో మండల టౌన్ సెక్రటరీ మహిపాల్, వివేకానంద కాలేజ్ అధ్యక్షుడు కిషోర్, మండల ఉపాధ్యక్షుడు విజయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌కు మంత్రిపదవి ఇవ్వాలి

నందిగామ: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ కైవసం చేసుకుందని, ఈ పర్యాయం కాంగ్రెస్ అభ్యర్థిగా వీర్లపల్లి శంకర్ ఘన విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలో 10 ఏళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం వీర్లపల్లి శంకర్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.